సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

కుత్బుల్లాపూర్: సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని చెరుకుపల్లి కాలనీలో సీసీ రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులను మంజూరు చేయించారు. దీంతో స్థానికులు ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ మహ్మద్ జాకీర్, కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ మీసాల రాములు, జనరల్ సెక్రెటరీ సూర్య బాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మల్లేష్, రాందాస్, సంగమ్మ, రాజు, అక్బర్ హుస్సేన్, ఈశ్వర్, సుబ్బారావు, శ్రీనివాస్ గుప్తా, వీరేష్ పాల్గొన్నారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తున్నాం



మ్యాన్‌హోళ్లను శుభ్రం చేస్తున్న సిబ్బంది

కుత్బుల్లాపూర్: డ్రైనేజీ ఓవర్ ఫ్లో ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ ముందుకు సాగుతున్నామని వాటర్ వర్క్స్ మేనేజర్ అనూష అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఫిర్యాదులను మంగళవారం గల్పర్ సహాయంతో తొలగించారు. అదే విధంగా వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో జామైన డ్రైనేజీని సాఫీగా వెళ్లేలా చేశారు. ప్రతిరోజు వచ్చే ఫిర్యాదులు తీసుకొని 24 గంటల్లో వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. డివిజన్ ఇన్‌చార్జి సాయి నేతృత్వంలో సిబ్బంది సత్యం తదితరులు డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

వసతులు లేక వెతలు

ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజీల్లో వేధిస్తున్న సమస్యలు

కాలేజీ విద్య పేద విద్యార్థులకు గగనమవుతోంది. దీంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని కార్మిక వాడలు, బస్తీలు, పట్టణాలు, గ్రామాల్లో నివసించే నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేక ..హైస్కూల్, ఇంటర్ విద్యతోనే స్వస్తీ చెప్పాల్సిన వస్తోంది. ప్రతి ఏటా జిల్లాలో 108 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 8 వేల మంది విద్యార్థులు పదోతరగతి పూర్తి చేసి.. ఇంటర్ చదువుకు వెళ్లాల్సి ఉండగా, సరిపడు ప్రభుత్వ ఇంటర్ కాలేజీలు లేకపోవటంతో సగం మంది విద్యార్థులు హైస్కూల్ చదువులతోనే ముగించాల్సిన దుస్థితి నెలకొంది. ఇంటర్ పూర్తి చేసుకున్న కొద్ది మంది విద్యార్థులు కూడా .. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు లేక పోవటంతో ఉన్నత చదువులకు వెళ్లలేకపోతున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

- హైస్కూల్, ఇంటర్ కాలేజీల్లో షిఫ్టు సిస్టమ్‌లో డిగ్రీ కాలేజీల మనుగడ
- బోధన, బోధనేతర సిబ్బంది కొరత
- మంచినీటి, మరుగు దొడ్ల పరిస్థితి మరింత అధ్వానం





మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నాలుగు ప్రభుత్వ ఇంటర్ కాలేజీలు ,రెండు ఎయిడెడ్ కాలేజీలు ఉన్నాయి. ఇందులో 2,640 మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాగే జిల్లాలోని 228 ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్ కళాశాలల్లో 1.13 లక్షల మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. జిల్లాలో మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్‌లో చాలీచాలని భవనాల్లో అరకొర సౌకర్యాల నడుమ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. బొల్లారం, అల్వాల్‌లో ప్రభుత్వ ఎయిడెడ్ కాలేజీలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ కాలేజీలలో వసతుల పరిస్థితి కూడా అంతంత మాత్రమేనని చెప్పవచ్చు.

15 మండలాలకు 4 మండలాల్లో ఇంటర్ కాలేజీలు

జిల్లాలో 15 మండలాలు ఉన్నాయి. 11 మండలాల పరిధిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు లేక పోటంతో స్థానిక విద్యార్థులకు ఇబ్బందులు తప్పటం లేదు. శామీర్‌పేట, కీసర , ఘట్కేసర్, మేడిపల్లి, మూడు చింతలపల్లి, ఉప్పల్, కాప్రా, బాచుపల్లి, దుండిగల్, అల్వాల్, బాలానగర్ మండలాల పరిధిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీంతో విద్యార్థులు పక్క మండలాల పరిధిలోని ప్రభుత్వ కాలేజీల్లో చదువుకోవటమో ..లేక ప్రైవేట్ కాలేజీలను ఆశ్రయించటమో చేయాల్సి వస్తోంది. దీంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది.

ఇంటర్ కాలేజీల్లోనే... డిగ్రీ చదువులు

జిల్లాలో నాలుగు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనే ..షిఫ్ట్ సిస్టమ్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలను కొనసాగుతున్నాయి. చాలీ చాలని వసతుల మధ్య విద్యార్థులు తమ చదువులను నెట్టుకురావాల్సి వస్తోంది. జిల్లాలో ఐదు డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. ఉప్పల్‌లోని డిగ్రీ కాలేజీ స్థానిక ప్రభుత్వ హైస్కూల్ భవనంలో కొనసాగుతోంది. మల్కాజిగిరి డిగ్రీ కాలేజీ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం షిఫ్టు పద్ధతిలో తరగతులను నిర్వహిస్తున్నారు. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్‌లోని డిగ్రీ కాలేజీలు కూడా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నం వేళ షిఫ్టు సిస్టమ్‌లో కొనసాగుతున్నాయి. ఈ నాలుగు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో మొత్తంగా 1040 మంది విద్యార్థులు చదువుతున్నారు. దీంతో జిల్లాలో ఇంటర్ పూర్తి చేసిన నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ప్రవేశం లభించకపోవటంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి అప్పోసప్పో చేసి ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో చదుకోవాల్సిన వస్తోంది. మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలని దశాబ్ద కాలం నుంచి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తున్నారు. అయినా మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి మోక్షం కలుగలేదు.

సమస్యల నడుమ సదువులు

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పలు సబ్జెక్టులకు సంబంధించిన అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంటర్‌లో కాంట్రాక్టు లెక్చరర్లతో విద్యా సంవత్సరాన్ని నెట్టుకొస్తున్నారు. విద్యార్థులకు కాలేజీల్లో కనీస వసతులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. మంచినీటి కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలల పరిస్థితి మరి అధ్వానంగా ఉంది. గంటల తరబడి వేచి ఉంటే తప్ప ..బాత్ రూమ్‌లకు వెళ్లలేని పరిస్థితి ఉంది. అధ్యాపకులకు కూడా ఈ ఇబ్బందుల నుంచి మినహాయింపు లేదని చెప్పవచ్చు. విద్యుత్ సదుపాయం కూడా సరిగ్గా లేదు. బోధనేతర సిబ్బందిని నియమించకపోవడంతో అక్కడ ఉన్న అధ్యాపకులే అన్ని విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలను పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ అధికారులకు ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై చూపిస్తున్న మోజును ప్రభుత్వ కాలేజీలపై చూపకపోవడంతో విద్యార్థులు సకల సమస్యలతో చదువులు కొనసాగించాల్సి వస్తోందని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి.

ప్రభుత్వ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. మరుగుదొడ్లు, మూత్రశాలల సరిపడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను భర్తీ చేయాలి. మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీతోపాటు జూనియర్ కాలేజీలు లేని 11 మండలాల్లో ప్రభుత్వ కాలేజీలను ఏర్పాటు చేయాలి. సమస్యల పరిష్కారానికి పోరాటాలను తీవ్రతరం చేస్తాం.

– రాథోడ్ సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

నీటి ఎద్దడిపై క్షేత్రస్థాయి పర్యటన



తాగునీటి సమస్యను మేనేజర్‌కు వివరిస్తున్న కార్పొరేటర్ శేషగిరి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ రావి నారాయణరెడ్డినగర్ ఈస్ట్‌లో మంగళవారం తాగునీటి సమస్యపై సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ రావుల శేషగిరి పర్యటించారు. వాటర్ వర్క్స్ అధికారి రోహిణికి స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు నారాయణ, మాజీ అధ్యక్షుడు మురళీకృష్ణ, కాలనీ వాసులు భాస్కర్, రమేష్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై ఉద్యమించాలి



సమావేశంలో పాల్గొన్న శంభీపూర్ కృష్ణ

దుండిగల్: ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు నిర్వహించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. గండిమైసమ్మలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్వీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్వీ నియోజకవర్గ ప్రెసిడెంట్ అఖిల్, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ నాయక్, సందీప్, దినేష్, కిరణ్, రతన్, రాజు యాదవ్, సందీప్, మోసిన్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

సేవా భావం పెంపొందేలా కృషి



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భీమ్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించే దిశగా కృషి చేస్తున్నామని సత్‌జ్ఞాన్ స్కూల్ కరస్పాండెంట్ చింతల మల్లేశం అన్నారు. వరద ముంపు ప్రాంతాల విద్యార్థులను ఆదుకునేందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పిలుపు మేరకు వేంకటేశ్వరనగర్‌లోని సత్‌జ్ఞాన్ స్కూల్ విద్యార్థులు 4 వేల నోట్ పుస్తకాలను తమ పాకెట్ మనీతో సమకూర్చారు. మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ మల్లేశం చేతుల మీదుగా వాటిని రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ చైర్మన్ భీమ్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్ ఏవీ రావు, యూత్ చైర్మన్ మణిదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి



లింక్ రోడ్ల పనులపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

- ఎమ్మెల్యే వివేకానంద్
- లింక్ రోడ్ల అభివృద్ధిపై అధికారులతో సమీక్ష

కుత్బుల్లాపూర్: వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన లింక్ రోడ్ల పనులపై హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఆర్‌డీసీఎల్), జీహెచ్‌ఎంసీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. రూ.29 కోట్ల నిధులతో జాతీయ రహదారి–44 నుంచి ఫాక్స్ సాగర్ మీదుగా రామిరెడ్డినగర్ ఇండస్ట్రియల్ ఏరియా, అదే విధంగా రూ.36 కోట్లతో గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్ హనుమాన్ టెంపుల్ నుంచి మిథిలానగర్, ప్రగతి నగర్ నుంచి ఎల్లమ్మ బండమీదుగా మహాదేవపురం వెటర్నరీ హాస్పిటల్ వరకు రూ. 30 కోట్లతో చేపడుతున్న లింకు రోడ్డు పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింక్ రోడ్ల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి, ప్రయాణ దూరం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు జగన్, సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సురేందర్ రెడ్డి, టీపీఎస్ రమేష్, న్యాక్ ఇంజనీర్ జయశ్రీ , విజయ్ కుమార్, విట్టలయ్య, హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులు జెరేమయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ ఎమ్మెల్యే.. సమస్యలు పట్టించుకోరా?

- గొప్పలు చెప్పుకోవడం కాదు
- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



రోడ్డు పనుల పరిశీలనలో మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గొప్పలు చెప్పుకుంటున్న వ్యక్తి ఈ ప్రాంత సమస్యలను ఎప్పుడూ పట్టించుకోలేదని, అభివృద్ధి పనులను అడ్డుకుంటూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు యత్నిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌లో రోడ్లు అధ్వానంగా మారడంతో స్థానికులు శ్రీశైలంగౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువెళ్లి రూ.15.50 లక్షల నిధులను మంజూరు చేయించారు. మంగళవారం సదరు రోడ్డు పనులను పరిశీలించేందుకు వచ్చిన ఆయనకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సమస్యలను ప్రజాప్రతినిధులు గాలికొదిలేశారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తోందని అన్నారు. బస్తీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మహ్మద్ తౌసీఫ్, జమీల్ పాషా, రాములు, రంగయ్య, భవాని, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, మల్లేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కదిలారు.. పనులు ప్రారంభించారు



నాలా పనుల్లో భాగంగా కల్వర్టు వద్ద స్లాబ్ పనులను చేపడుతూ..



సాయినగర్‌లో జేసీబీతో మట్టిని చదును చేస్తూ..

సాక్షి ఎఫెక్ట్..

నిజాంపేట్: ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన భూగర్భ డ్రైనేజీ పనులపై సాక్షిలో ప్రచురితమైన 'తవ్వారు.. వదిలేశారు' కథనానికి అధికారులు స్పందించారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని తుర్క చెరువు ఎగువ ప్రాంతం నుంచి మురుగునీరు చెరువులోని చేరకుండా రాజధాని స్కూల్ దిగువున ఉన్న నాలాలో కలిపేందుకు అధికారులు పైపులైన్ పనులకు శ్రీకారం చుట్టారు. సాయినగర్ ప్రాంతంలో రోడ్డును తవ్వి నెలలు కావస్తున్నా పూర్తి చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఈ విషయంపై 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో మంగళవారం సంబంధిత అధికారులు పనులను తిరిగి ప్రారంభించారు. అంతే కాకుండా రాకపోకలు సాగించేందుకు వీలుగా రోడ్డుపై మట్టిని జేసీబీతో చదును చేయించారు.

అధికారులూ.. చర్యలు తీసుకుంటారా?



మార్కెట్ రోడ్డులో మోటార్ సాయంతో మంజీర నీటిని తోడుతున్న దృశ్యం

రంగారెడ్డినగర్: మంజీర పైపు కనెక్షన్‌కు మోటార్లు అమర్చి నీటిని తోడేస్తున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డులో కొందరు భవన యజమానులు మంజీర నీరు వదిలే సమయంలో ఇష్టానుసారంగా మోటార్లు అమర్చి ఎక్కువ మొత్తంలో నీటిని తోడుకుంటున్నారు. దీంతో మిగతా ఇళ్లకు లో ప్రెజర్‌తో నీళ్లు వస్తుండటంతో ఇబ్బంది పడుతున్నారు. అక్రమ పద్ధతిలో తాగు నీటిని తోడుతూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్న సదరు భవన యజమానులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

400 మందికి కళ్లజోళ్ల అందజేత



పారిశ్రామికవేత్త మాధవరెడ్డిని సన్మానిస్తున్న రామ్‌రెడ్డి తదితరులు

రంగారెడ్డినగర్: గాంధీ నగర్‌కు చెందిన పారిశ్రామికవేత్త, అనంతరెడ్డి ఎడ్యుకేషనల్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాధవరెడ్డి, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా అల్వాల్ గ్రామంలో విద్యార్థులకు, గ్రామస్తులకు మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 400 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమానికి హాజరైన మానస టూల్‌టెక్ అధినేత వాకిటి రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా విశేష సేవలందిస్తున్న మాధవరెడ్డిని సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ రాజేంద్ర ప్రసాద్, క్లబ్ ప్రతినిధులు సాయికుమార్, ధన్‌పాల్‌రెడ్డి శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని కళాశాలపై కేసు నమోదు

మూసాపేట: గుర్తింపు లేని కళాశాల నడుపుతూ మాయమాటలు చెప్పి చేర్చుకోవడంతో విద్యార్థుల ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కేపీహెచ్‌బీ కాలనీలోని అమిత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ మెడికల్ సైన్స్ కళాశాలలో పారా మెడికల్ కోర్సుల్లో చేర్చుకున్నారు. కళాశాలకు గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోరాట యోధుడు కొమురం భీమ్



కొమురం భీమ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

నిజాంపేట్: గిరిజనుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు కొమురం భీమ్ అని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. కొమురం భీమ్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నిజాంపేట్ ఇంద్రన్న కాలనీలో సీపీఐ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జల్, జంగిల్, జమీన్ నినాదాన్ని ఆయుధంగా చేసుకొని ఆదివాసుల హక్కుల కోసం పోరాడారన్నారు. కార్యక్రమంలో యాదయ్య, శేషయ్య, సైదులు, ఖాజా, లక్ష్మయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

5న చలో ఇందిరాపార్కు

మోతీనగర్: కార్పొరేట్ సంస్థల రాకతో తమ ఉపాధి దెబ్బతిందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహ నాయీ అన్నారు. మంగళవారం మూసాపేట డివిజన్ మోతీనగర్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గ సమావేశం అవంతినగర్ తోట కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ డిమాండ్లతో నవంబర్ 5న ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించారు. తమ కుల వృత్తిని ఇతర కులాల వారు చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, సిరిసిల్ల శ్రీనివాస్, ధర్మం, కనకయ్య, బాలకృష్ణ, భాస్కర్, వి. గోపి నాయి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

255.5 టన్నుల భవన వ్యర్థాల తరలింపు



అల్వాల్ సర్కిల్ పరిధిలో వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

కుత్బుల్లాపూర్: గ్రేటర్ హైదరాబాద్‌ను వ్యర్థాల రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. జోనల్ పరిధిలోని మూసాపేట్, కూకట్‌పల్లి, అల్వాల్ సర్కిళ్ల పరిధిలో మూడు రోజులుగా రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్తాచెదారాలు, భవన వ్యర్థాలను సిబ్బంది తొలగిస్తున్నారు. జోనల్ పరిధిలో 255.5 టన్నుల భవనాల వ్యర్థాలను, 56.4 టన్నుల చెత్తాచెదారాలను తరలించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. అదే విధంగా కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలో వ్యర్థాలను తొలగించేందుకు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగుతున్నామని తెలిపారు.





కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రూప్–1 మెయిన్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పేట్‌బషీరాబాద్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ జాం కాకుండా ఎప్పుడికప్పుడు క్లియర్ చేశారు.

– సుభాష్‌నగర్

ఐదేళ్ల చిన్నారిపై దాడి చేసి అసభ్య ప్రవర్తన

నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు

దుండిగల్: ఐదేళ్ల చిన్నారిపై దాడి చేసి అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై దుండిగల్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. బౌరంపేట ప్రాంతానికి చెందిన భార్యాభర్తలు నివసిస్తున్నారు. వీరికి 6, 5 ఏళ్ల ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. వీరు అద్దెకు ఉంటున్న మూడవ అంతస్తులో మరో వ్యక్తి తన కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. వీరితో బాధిత కుటుంబం చనువుగా ఉండేది. అతడి భార్య డెలివరీ కోసం తన పుట్టింటికి వెళ్లింది. దీంతో తన స్నేహితుడైన షాపూర్‌నగర్ ప్రాంతానికి చెందిన డ్రైవర్(36) తరుచూ ఇంటికి వస్తుండే వాడు. ఈ క్రమంలో అప్పుడప్పుడు బాధిత కుటుంబ సభ్యులు చనువుగా ఉన్న వ్యక్తి ఇంటికి వెళ్లేవారు. ఈ నెల 12వ తేదీన నిందితుడు ఆడుకుందాం.. అని చెప్పి చిన్న కుమార్తెను కొట్టి, మంచంపై పడేసి, దాడి చేసి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. కాగా సదరు బాలికకు 18న ఫిట్స్ రావడంతో అస్వస్థతకు గురైంది. వెంటనే తల్లిదండ్రులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. బాలిక ఒంటిపై ఉన్న గాయాలను పరిశీలించిన వైద్యులు దుండిగల్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు చిన్నారి తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు

మూసాపేట: మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదని, చేస్తున్న పద్ధతికి మాత్రమే వ్యతిరేకమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని భరత్‌నగర్ పార్కులో మంగళవారం బ్రేక్ ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల్లోకి మురుగు నీటిని పోకుండా దారి మళ్లించేందుకు గతంలో స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ తీసుకువచ్చిందన్నారు. దానికి కొన్ని నిధులు కేటాయించాలని కోరానన్నారు. రసాయన వ్యర్థాలను శుద్ధి చేస్తేనే మూసీ బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహేందర్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాంతారావు, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, బూరుగుపల్లి రామ్మోహన్, కృష్ణ గౌడ్, నాగిరెడ్డి పాల్గొన్నారు.